# పడమటి పయనం


కె.బి.ఎస్. కుమార్

నిర్వేదం—
నిస్తేజం—
నిస్సహాయత—
నిర్లిప్తత—....

విడివిడిగా ఆవహిస్తే ఆవేశం పెల్లుబుకడానికి అవకాశం ఉంటుందేమో? కసి ప్రజ్వరిల్లుతుందేమో! కాని అన్నీ కలిసికట్టుగా చుట్టుముట్టినప్పుడు—

ఒక నిశ్శబ్ద మందహాసం పెదవుల నుండి వెలువడుతుంది. ఒక నిశ్శబ్ద నాదం హృదయం నుండి అనంతంలోకి దూసుకుపోతుంది. ఒక నిశ్శబ్ద తరంగం హృదయంలోకి వచ్చి చేరాలని విఫలప్రయత్నం చేసి నెమ్మదిగా వెనక్కి జా(పా)రిపోతుంది.

వాటికర్థాలు విశ్వంలోని ఏ నిఘంటువులోనూ కన్పించవు.



ఆ మాటకొస్తే ప్రేమకు నిర్వచనం మటుకు ఏ పుస్తకంలో కన్పిస్తుంది గనక!?

ఇక్కడో డౌటు.

ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయత...

ఇవన్నీ మిథ్యేనా?

అలాంటప్పుడు భార్య, పిల్లలు, సంసారం... ఇవీ!?

ఏమో!

ఎవరికి తెలుసు??

నిక్కచ్చిగా చెప్పాల్సివస్తే మనిషికన్నా జంతువులు, పక్షులే నయం కాబోలు! ఎందుకంటే అవి ఒక దశకి చేరుకునేంతవరకు మాత్రమే తమ పిల్లల్ని పెంచుతాయి. ఆ తర్వాత—దేనిదారి దానిదే!! తర్వాత యాదృచ్ఛికంగా పరస్పరం ఎదురైనా శత్రువులై కలహించుకుంటాయి.

మనిషికీ అలాంటి ఆనవాయితీ ఉంటే బావుండు!

అప్పుడు మనిషికీ జంతువుకీ తేడా ఏముంది?

మనిషి కూడా మాట్లాడే జంతువు. అంతేగా?

నో—మనిషికి మెదడుంది!!

ఏం? జంతువుకు మాత్రం లేదూ!?

... ఆలోచనల నుండి విముక్తుడు కావడం కోసం తలని ఒక్కసారి బలంగా విదిలించారు సుబ్బరామయ్యగారు. చుట్టూ చూశారు.

గర్భగుడిలో దేవుడు నిర్వికారంగా ఉన్నాడు. రంగు వెలసిన గోడలు, పెచ్చులూడిన స్తంభాలు విశాలమైన ఆవరణలో పచ్చికతో బాటు పిచ్చిగా మొలిచిన పిచ్చిమొక్కలు. వంగిపోయి, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ధ్వజస్తంభం. గతంలోనే కూలిపోయిన గాలిగోపురం!

ఉద్ధరించేవాడు కరువైనప్పుడు గుడే కాదు. గుండె కూడా శిథిలం కాకతప్పదు.

ఉద్ధరించబడని హృదయం కూడా శిథిలాలయంతో సమానమే!

మనసు దేనితో ఉద్ధరించబడుతుంది?

సంస్కారంతో.

సంస్కారం దేనితో శుద్ధి చెయ్యబడుతుంది?

సత్ప్రవర్తనతో.

సత్ప్రవర్తన దేనివల్ల రాణిస్తుంది?





హడావిడిగా రోడ్డున పోతున్న ఓ పెద్దమనిషిని ఆపి ప్రశ్నించాడు పాపారావు.

"ఇంతకీ... ప్రేతాత్మలున్నాయంటారా...? మీ అభిప్రాయం చెప్పండిసార్...?"

"ఏమోనాయనా... నాకు మాత్రం ఏం తెలుసు... బ్రతికి ఉన్నప్పుడైతే — తెలుసుకోవడానికి ప్రయత్నించుండేవాడిని" చెబుతూనే అదృశ్యమయ్యాడా పెద్దమనిషి..."

—తిప్పన. 'వి' (ధర్మవరం)

స్వచ్ఛమైన మనుగడతో.

స్వచ్ఛమైన మనుగడ ఎలా సంప్రాప్తిస్తుంది?

సక్రమమైన పెంపకంతో.

అంటే?

తను· తన కొడుకుని సక్రమంగా పెంచడంలో లోటు చేశాడా??

చిన్నప్పుడు కేరింతలు కొడుతూ గుండెల మీద తంతూంటే మురిసిపోయాడు. అడిగినవన్నీ లేదనకుండా కొనిపెట్టాడు. రెక్కలు ముక్కలు చేసుకొని చదివించాడు. ఇంకా చదవాలనుందన్నప్పుడు ఇల్లు అమ్మేసి దోసిట్లో పోశాడు. పెద్ద ఉద్యోగం వచ్చిందని చెప్పినప్పుడు పొంగిపోయాడు. నచ్చిన పిల్లని పెళ్ళి చేసుకుంటానని చెప్పినప్పుడు ఆనందంగా తలూపి—తృప్తిగా అక్షింతలు వేశాడు. పెద్ద ఇంట్లోకి మారినప్పుడు గర్వంగా తలెగరేశాడు. తనకీ అన్నపూర్ణకీ కలిపి ప్రత్యేకంగా గది కేటాయించినప్పుడు మీసాలు మెలేశాడు.

ఆలస్యంగా పుట్టినా తండ్రి రిటైరయ్యేనాటికి కొడుకు సంపాదనాపరుడై, ప్రయోజకుడై, ఒకింటివాడైనప్పుడు ఆ తల్లిదండ్రులకి అంతకన్నా కావలసిందేముంది? హాయిగా కృష్ణారామా అనుకుంటూ గత స్మృతుల్ని తల్చుకుంటూ మురిసిపోవడం తప్ప పనీ పాటా ఏముంటుంది?

"ఇవాళ క్యాంపుంది. వెళ్ళొస్తా నాన్నా!!" వినయంగా చెప్పి వెళ్ళే కొడుకు—

"ఇవాళ ఏం కూర చెయ్యమంటారత్తయ్యా!? నమ్రతతో ప్రశ్నించే కోడలు.

"నువ్వు నిన్నగాక మొన్నొచ్చావు. నేను మొదట్నుండీ మా అమ్మ చేతివంటే తింటున్నాను. అంచాత మా అమ్మే వంట చెయ్యాలి" అనే కొడుకు.

"చదూకున్న దాన్నయినంతమాత్రాన మీకెదురుచెబుతాననుకుంటున్నారా? అలాగే మీ ఇష్టం..." అనే కోడలు...

"... ఈ మాత్రందానికి పనిమనిషెందుకమ్మా! నే చేస్తాగా! నాలుగ్గదులేగా! నేనూ డ్ఫేసి లోషన్ వేసి కడిగి తుడిచేస్తాలే. అబ్బాయి పిలుస్తున్నట్టున్నాడు. నువ్వెళ్ళు..." అంటూ చీపురు బలవంతాన లాక్కుని చీరచెరగు బొడ్లో దోపుకునే అన్నపూర్ణ...

ఇంతకన్నా ఏం కావాలి జీవితానికి??

సింహద్వారం వద్ద అలికిడి కావడంతో మళ్ళీ ఆలోచనలు తెగిపోయాయి. అటువైపు చూశారు సుబ్బరామయ్యగారు.

కుక్కలు!!

ఒక్కదాంతో మరొకటి చెలగాటమాడుతున్నాయి.

...వల్లభాచార్యులింకా ఎందుకు రాలేదు??

ఎప్పుడూ ఇక్కడే ఉండేవాడు—ఒక్క భోజనవేళ తప్పిస్తే. ఇవాళే రాకపోవడానిక్కారణం?

వల్లభాచార్యులు తనకన్నా దాదాపు నాలుగు మాసాలు పెద్ద. సరిగ్గా నాలుగు మాసాల క్రితం రిటైరయ్యాడు. ఇద్దరు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళు. మొత్తం నలుగురికీ పెళ్ళిళ్ళజయ్యాయి. ఒక అల్లుడు ఎలెక్ట్రికల్ ఇంజనీరు. ఢిల్లీలో ఉంటున్నారు. మరో అల్లుడు డాక్టరు. ఇటీవలే ఫారిన్‌లో సెటిలయ్యారు.

కొడుకులిద్దర్లో పెద్దవాడు గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్. రెండోవాడు స్టేట్ బ్యాంకులో క్యాషియర్. ఇద్దరు కోడళ్ళూ అప్సరసలను మించిన అందగత్తెలు!

వల్లభాచార్యులు ప్రతి రోజూ ఉదయం టిఫిన్ చెయ్యగానే గుడికొస్తాడు. భోజనం టైముకి ఇంటికి వెళ్తాడు. భోంచేసిన వెంటనే మళ్ళీ వస్తాడు. రాత్రి కనీసం ఎనిమిద్దాకా గుళ్ళోంచి కదలడు.

తనెన్నోసార్లడిగాడు. "ఒరే వల్లభా నీ వరస నాకేమీ నచ్చడంలేదురా! లక్షణమైన కొడుకులు, సులక్షణమైన కోడళ్ళు ఉండగా గుళ్ళో కాలక్షేపం చెయ్యాల్సిన కర్మేవిటీ?" అని!

నిశ్శబ్దహాసంతో మౌనంగా ఉండిపోయేవాడు ఒకోసారి.

ఒకోసారి మాత్రం "ఒరేయ్. మనం వయసుడిగిపోయిన వాళ్లం. వాళ్లా, ఉడుకురక్తం ఉరకలేస్తూన్నవాళ్లు. వాళ్ల మధ్య మనమెందుకు చెప్పు..." అనేవాడు.

తను మనసులోనే నవ్వుకునేవాడు.

ఈ వయసులో కొడుకులు, కోడళ్ళ చేత సేవలు చేయించుకోవడంతో ఉన్న అనుభూతి మరెందులో ఉంటుంది? ఆ మధురానుభూతికి సొంతం కావాలని వల్లభుడికి లేదా?

ఆమాటే వాడితో ఎప్పుడైనా అంటే నవ్వి ఊర్కుంటాడు.

ఆ నవ్వు కర్థం ఈనాడు తెల్సింది తనకి. తనూ రిటైరైన కొన్నాళ్లకి.

...మరోసారి నిట్టూర్చారు సుబ్బరామయ్యగారు.

మేన్ ప్రపోజెస్—గాడ్ డిస్పోజెస్ అని విజ్ఞులు ఊరికే అన్లేదు. మనిషి అనుకున్నట్టుగానే రోజులు గడిస్తే దైవానికి మనసులో స్థానం తుడిచిపెట్టుకుపోతుందేమో!

అన్నపూర్ణ కన్ను మూయడం జీవితంలో తనెదుర్కొన్న మొదటి విఘాతం. ఆ తర్వాత వరసగా అన్నీ అవే!!

సంపాదన తగ్గేసరికి మనిషికున్న విలువ ఒక్కసారిగా పడిపోతుందా? జీతం డబ్బులు కాస్తా పెన్షన్ 'రాళ్లు'గా మారేసరికి మనిషిలోని విలువ ఒక్కసారిగా మారిపోతుందా?

ఛ—ఏం మనుషులు?

ఛఛ—ఏం కొడుకులు??

"గదిలో గడిపితే అత్తయ్య జ్ఞాపకాలు మిమ్మల్ని వేధిస్తాయి మావయ్యా! ఇక్కడైతే సందడిగా ఉంటుంది" అని, తన మంచాన్ని కోడలు మెట్ల క్రిందికి మార్చినప్పుడు—

"ఊరికే కూచుంటే గతం గుండెల్ని పొడుస్తుంది. లంకంత ఇల్లుందిగా! టైమ్ పాస్‌కోసం బూజూ అదీ దులుపుతుండండి నాన్నా! రోజు మార్చి రోజు కిటికీల పరదాలు మార్చండి. అప్పుడప్పుడూ అలా బయట తిరిగి వస్తూండండి. ఆఁ... మర్చాను. వచ్చేప్పుడీ సరుకులు పట్రండి" అని కన్న కొడుకు అన్నప్పుడు—

వాళ్ల ఆంతర్యం బోధపడళ్ళేదు.

బ్రతికున్నంత కాలం అన్నపూర్ణ ఆ ఇంట్లో పనిమనిషి—కమ్—వంట మనిషి బాధ్యత వహిస్తున్నందుకు జీతంగా మాత్రమే అంతో ఇంతో గౌరవం లభిస్తూ వచ్చిందన్న సత్యం బోధపళ్ళేదు.

క్రమంగా విసుగు, కోపం, నిర్లక్ష్యం తనని ఆప్యాయంగా పలకరిస్తాయన్న సత్యం బోధపళ్ళేదు.

చివరికి...

చివరికి...

ఆ మూడింటినీ మేళవించి...

"మీకు ఊళ్ళో స్నేహితులే లేరా? ఇంత త్వరగా ఇంటికొచ్చి అనవసర విషయాల్లో జోక్యం చేసుకునేబదులు అలా అలా తిరిగి భోజనం టైముకి రాకూడదూ!?" అని ఈ ఉదయం సుపుత్రుడన్నప్పుడు—

నగ్నసత్యాలు ఒక్కసారిగా బోధపడ్డాయి.

జ్ఞాన చక్షువులు ఒక్కసారిగా తెర్చుకున్నాయి.

... ఒరే వల్లభా! ఆనాటి నీ నవ్వు కర్థం ఈనాడు తెలిసొచ్చిందిరా! అనులోమ విలోమాల మధ్య తేడా ఇప్పుడవగతమవుతోంది... ఎక్కడరా నువ్వు...?

సుబ్బరామయ్యగారి హృదయం వేదనా

కీలల్లో ఉడికిపోతూంది. ఎవరో రావాలి. ఈ ఆవేదనలో భాగం పంచుకోవాలి. నాలుగు ఓదార్పు మాటలు చెప్పాలి. అవి అబద్ధాలైనా సరే అతిశయోక్తులైనా సరే...

ఒక్కో సందర్భంలో చెప్పే అబద్ధం నిజం కన్నా విలువైనదిగా ఉంటుంది.

కాని ఎవరొస్తారు?

మరోసారి సింహద్వారం అనబడే కూలిపోయిన గాలిగోపురం వైపు చూశారు సుబ్బరామయ్యగారు. కంటికన్పించని గాలి విసురుగా వచ్చి శరీరాన్ని తాకింది.

ఒక్కసారిగా పడిపోబోయి, స్తంభాన్ని పట్టుకొని నిలద్రొక్కుకున్నారు.

వృద్ధాప్యం మనిషికి మొదటి మరణం. నిరాదరణ రెండవ మరణం. మూడవది నిజమైన మరణం.

ఈ రహస్యాన్ని మొదట్లోనే గ్రహించగలిగే దెంతమంది?

అన్నపూర్ణ నిజంగా ఎంతో అదృష్టవంతురాలు. తన కళ్లముందే వెళ్లిపోయింది. పునిస్త్రీగా వెళ్ళిపోతే ఈ జన్మకి చాలందీ అని అప్పుడప్పుడూ అంటున్నప్పుడు తను 'ఛా' అనేవాడు.

ఒకవేళ దానికంటే ముందు తనే పోయి ఉంటే దాని గతేమయ్యేదో!!

ప్రస్తుతం మిగిలింది తను.

చస్తూ బ్రతకాలా??

ఇవాల్టినుండి తన ఇల్లే తనకి సత్రం!!

ఆ మాట తల్చుకుంటే చాలు. ఒంటరితనం, దిగులు, గుబులు హృదయాన్ని పిండేస్తున్నాయి.

ఏం చేశాడు తను? తన ఉనికి వాళ్లకి చేదయిందా?

ఎందుకుయయ?

కొడుక్కోసం ఎందరో ఆఫీసర్లు, పెద్ద మనుషులు వస్తుంటారు. మెట్ల కింద పట్టె మంచం, దాని మీద రోగిష్టి వాడిలా, కుష్టు రోగిలా తను.

అవును మరి. భరించలేని ముసలి వాసన !!

కన్న తండ్రిగా వాళ్లకి పరిచయం చేయడానికి నామోషీయాయయయ? ఈ వైభోగం, ఈ గాంభీర్యం, ఈ హుందాతనం సిగ్గుతో తల వంచుకుంటాయా ?

.... నడుములు నెప్పెట్టడంతో ఇబ్బందిగా కదిలారు సుబ్బరామయ్య గారు. గతంలో ఇదే గుడిలో ఇదే స్థలంలో కూచుని వల్లభాచార్యులతో గంటల తరబడి బాతాఖానీ కొట్టే వారు.

ఇప్పుడు —ఇప్పుడో —?

వచ్చి గంట కాలేదు —అప్పుడే విసుగుపుడుతోంది. భోజనం టైముకి రమ్మన్నాడు కొడుకు. అంటే—? ఇంకా కనీసం రెండున్నర గంటఐ ఐఐ!! భోజనమైన వెంటనే మళ్లీ రావాలేమోఐ! మళ్లీ రాత్రి భోజనం టైము దాకా ఇక్కడే! ఇలా ఎంత కాలం??



“నేను కూడా పుస్తకాన్నయితే రాత్రింబవళ్లు చదివేవారు నన్ను కదూ” అడిగింది నీలూ. పుస్తకాల పురుగైన భర్తతో.

‘డైరీవయితే మరీ మంచిది. ప్రతి సంవత్సరం మార్చేసూవుండొచ్చు’... అన్నాడు భర్త నాగేంద్ర నవ్వుతూ

అబ్దుల్ గఫూర్ (మోర్తాడ్)

“.....బ్రతికినంత కాలం రా ఫూల్!!” అంతరంగం గట్టిగా అరిచింది.

మగాడుగా పుట్టినందుకా ఈ శిక్ష ?

కొడుకుని కన్నందుకా ఈ శిక్ష??

ఇంకా బ్రతుకుతున్నందుకా ఈ శిక్ష???”

వీల్లేదు!

ఈ శిక్ష తను అనుభవించడానికి వీల్లేదు! తను మరో వల్లభాచార్యులు కావడానికి వీలు లేదు!! మమతలు, బంధాలు, అనుబంధాలు పెంచుకున్నంత కాలం, ఈ బాధలు, ఆవేదనలు తప్పవు. ఈవూరి కావూరు ఎంత దూరమో ఆ వూరి కీవూరూ అంతే!

ఓ చిన్న గుడిసె అద్దెకు తీసుకొని తన కొచ్చే పెన్షన్ డబ్బుల్తో హాయిగా గడిపేయగలడు!

అవునూ, వల్లభుడికీ ఆలోచన ఇంతవరకూ ఎందుకు రాలేదు? వట్టి మొద్దు రాచిప్ప!!

తామిద్దరూ కలిసి తీసుకుంటే ఇంకా బాగుంటుంది. ఒకరు అన్నం చేస్తే మరొకరు పప్పు చెయ్యొచ్చు. వాడు నీళ్లు తెస్తే తను అంట్లు తోమొచ్చు.

కావలసినంత స్వేచ్ఛ!

బోలెడంత కాలక్షేపం!!

...ఉత్సాహంగా లేచారు సుబ్బరామయ్యగారు.

చిత్రం! ఇప్పుడు మనసెంతో తేలిగ్గా వుంది.

తూర్పున కొడుకు ఇల్లుంది. అక్కడి నుంచి ఉత్తర దిశగా నడచి గుడికొచ్చాడు. దక్షిణం వైపు వల్లభాచార్యులు ఇల్లుంది. వాడు రాకపోతే ఏం? తనే వాడింటికి వెళ్లి చెబుతాడు!

అడుగులు వడివడిగా పడుతున్నాయి.

ఎక్కడ్నుంచి వచ్చిందీ శక్తి? అందుకే అన్నారు. ఉత్తమమైన ఆలోచనని మించిన బలవర్ధకమైన ఔషధం మరోటి లేదని.....

నడుస్తూ నడుస్తూ ఓ చోట ఆగిపోయారు సుబ్బరామయ్యగారు. అక్కడేదో గుంపు కన్పించింది.

“.... బాబూఏం జరిగిందక్కడ?” అటువైపు నుండి వస్తూన్న కుర్రాణ్నడిగాడు.

“ఎవడో దిక్కు లేని పక్షి. నడుస్తూ నడుస్తూ గుండె పట్టుకొని పడిపోయాట్ట. మరి లేవలేదు. ఎంతసేపైనా ఎవ్వరూ రాకపోయే సరికి ఎవరో మునిసిపాలిటీ వాళ్లకి ఫోన్ చేశారు. వాళ్లొచ్చి తీసుకుపోతున్నారు.”

అప్రయత్నంగా జేబులు తడుముకున్నారు సుబ్బరామయ్యగారు. ఏదో నోటు తగిలింది. తీసి చూశారు, ఐదు.

పాదాలు అటుకేసి నడిచాయి.

శవాన్ని బండిలో వేసిన వాడికిస్తే కాసింత పుణ్యమన్నా వస్తుంది. రేపు తనకెలాంటి చావు రానుందో!!

గుంపుని తప్పించి కాస్త ముందుకెళ్లి తొంగి చూశారు.

భృకుటి ముడిపడింది.

కళ్లు విచ్చుకున్నాయి.

‘...వ...ల్ల....భా.....!’ పెదవులు అస్పష్టంగా గొణిగాయి.

ఒక్క క్షణం పాటు—

హృదయంలో కలవరం!

చెవుల్లో సముద్ర ఘోష!!

అంతరంగంలో అగ్నికెరటాలు!!!

... గళం మూగవోయింది గాని గుండె గర్జిస్తూనే వుంది.

శవాన్ని, బండిని పిచ్చివాడిలా మార్చి మార్చి చూశారు.

ఏదో మాట్లాడాలని ఉంది.

ఎంతో మాట్లాడాలని వుంది.

కాని—

ఏదీ మాట్లాడలేదుఐ!

ఏదీ మాట్లాడాలనుకోలేదు.

ఆయన పాదాలు నెమ్మదిగా పడమటి దిశకేసి తిరిగాయి.

నిర్వేదం—

నిస్తేజం—

నిస్సహాయత—

నిర్లిప్తత—

విడివిడిగా ఆవహిస్తే ఆవేశం పెల్లుబకడానికి అవకాశం వుంటుందేమో! కసి ప్రజ్వరిల్లుతుందేమో! కానీ అన్నీ కలిసికట్టుగా చుట్టిముట్టినప్పుడు—

ఒక నిశ్శబ్ద మందహాసం పెదవుల నుండి వెలువడుతుంది. ఒక నిశ్శబ్ద నాదం హృదయం నుండి అనంతంలోకి దూసుకుపోతుంది. ఒక నిశ్శబ్ద తరంగం హృదయంలోకి వచ్చి చేరాలని విఫల ప్రయత్నం చేసి నెమ్మదిగా వెనక్కి జా(పా)రిపోతుంది.

ఒక నిశ్శబ్ద పయనానికి ముహూర్తం ఆవిష్కరించబడుతుంది.

ఆ పయనం ఎందుకో ఆ విధాతకే తెలియాలి.